నాలా పనులు పరిశీలించిన కార్పొరేటర్



నాలా అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దార్‌నగర్‌లో నాలా పనులను అధికారులతో కలిసి గురువారం కార్పొరేటర్ సబిహాబేగం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నాలా విస్తరణ పనులను అధికారుల సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షుడు గౌసుద్దీన్, డీసీ వంశీకృష్ణ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ కరుణాకర్, టీపీఎస్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఎస్ఎన్‌డీపీ ఈఈ శ్రీనాథ్ రెడ్డి, డీఈ రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఏఈ రంజిత్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్

బాలానగర్: డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, దాసరి బస్తీలో కమ్యూనిటీ హాల్, దిల్‌కుష్‌నగర్‌లో స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులు, అంతర్గత రోడ్ల పనులను త్వరగా ప్రారంభించాలని కోరారు.

వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం, అర్చనలు, శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జూన్ 2న శ్రీవారి కల్యాణం, అనంతరం అన్న సమారాధన ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ చైర్మన్ నాగిరెడ్డి కోరారు.

ఫ్యాన్సీ నంబర్ల వేలం ద్వారా రూ.34.17 లక్షల ఆదాయం

కేపీహెచ్‌బీకాలనీ: ఫ్యాన్సీ నంబర్ల వేలం ద్వారా కూకట్‌పల్లి ఆర్టీఓ కార్యాలయానికి రూ.34.17 లక్షల ఆదాయం వచ్చిందని ఎంవీఐ శ్రీనుబాబు తెలిపారు. గురువారం మొత్తం 51 నంబర్లు వేలానికి వచ్చినట్లు తెలిపారు. వేలం వేసిన నంబర్లలో టీజీ 08 ఏసీ 0006 నంబర్‌కు అత్యధికంగా రూ.21.7 లక్షలకు లాడిగా డైమండ్స్ సంస్థ, టీజీ 08 క్యూ 9999 నంబర్‌ను రూ.6.80 లక్షలకు రత్నదీప్ సంస్థ మెర్సిడెజ్ కారు కోసం నంబర్లను కొనుగోలు చేసినట్లు తెలిసింది.

స్తంభాలు పునరుద్ధరించారు.. లైట్లు మరిచారు!

ఓల్డ్‌బోయిన్‌పల్లి: సమతానగర్‌లోని ప్రధాన రహదారిలో గాలికి చెట్లు కూలి విద్యుత్ స్తంభాలపై పడ్డాయి. దీంతో స్తంభాలు విరగడంతో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ విద్యుత్ అధికారులతో మాట్లాడి నూతన స్తంభాలను వేసేలా చర్యలు తీసుకున్నారు. రోడ్డు నెంబర్ ఒకటిలో కూడా నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. కానీ జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రికల్ అధికారులు వీధి దీపాలను ఏర్పాటు చేయలేదు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సమతానగర్‌లో వీధి దీపం లేకుండా ఉన్న విద్యుత్ స్తంభాలు

మత్తు.. యువత చిత్తు!

నిర్మానుష్య, ఖాళీ ప్రదేశాలే వారి కేంద్రాలు

- తల్లిదండ్రుల నిఘా కూడా అవసరం అంటున్న పోలీసులు
- ప్రశ్నించే వారిపై దాడులు

మత్తు పదార్థాలకు అలవాటు పడి యువకులు చిత్తు అవుతున్నారు. ఉజ్వల భవిష్యత్‌ను అందుకోవాల్సిన వారు మత్తులో బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డుకాలనీ ప్రాంతంలోని అనేక నిర్మానుష్య ప్రాంతాల్లో గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారు. అడపాదడపా పోలీసులకు సమాచారం అందడంతో కొందరు పట్టు బడుతున్నారు. మరికొందరు మాత్రం గంజాయి మత్తులో తూగుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే మత్తులో యువత వారిపై దాడులకు దిగుతున్నారు.



కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ గృహ సముదాయంలో కుష్ గంజాయి విక్రయిస్తున్న ముఠాని అరెస్టు చేసిన ఎస్‌టీఎఫ్ బృందం (ఫైల్)

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీలో ప్రధానంగా సాయంత్రం వేళల్లో నిర్మానుష్య ప్రదేశాలు గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించేందుకు అడ్డాగా మారుతున్నాయి. రోడ్డు నెంబర్ ఒకటి నుంచి ఫోర్త్ ఫేజ్ వైపునకు వెళ్లే దారిలో సాయంత్రం వేళల్లో అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెడితే గంజాయి మత్తుకు అలవాటు పడ్డ వారి గుట్టును పట్టుకోవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు. 5వ ఫేజ్ దాటిన తరువాత లోధా అపార్టుమెంట్స్‌కి నడుమ రోడ్డుకి ఇరువైపులా కొందరు యువకులు రాత్రి ఇక్కడి ఖాళీ ప్రదేశాన్ని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. సిగరెట్లను తాగుతూ అక్కడే గంటల తరబడి కాలం గడుపుతున్నారు. ఇందులో కొందరు సిగరెట్లలో మత్తు పదార్థాలు కలిపి సేవిస్తున్నట్లు తెలుస్తోంది. క్రికెట్ గ్రౌండ్‌ను ఆనుకొని ఉన్న గుట్టలు చెట్లపొదలను కూడా వీరు అడ్డాలుగా మార్చుకుంటున్నారు. గతంలో ఇక్కడే గంజాయి విక్రయిస్తూ ఇద్దరు వ్యక్తులు పట్టుబడిన సంఘటనలు సైతం ఉన్నాయి. నాలుగో ఫేజ్ నుంచి 15వ ఫేజ్ వైపు ఖాళీ స్థలాలు, కైత్లాపూర్ గ్రౌండ్ వద్ద ఇక్కడి బెల్టు షాపును ఆనుకొని ఖాళీ స్థలంలో మద్యం సేవించే వారితో పాటు గంజాయి సేవించే వారు తోడవుతు అర్ధరాత్రి వరకు ఇక్కడే తిష్ట వేస్తున్నారు. కేపీహెచ్‌బీ 9వ ఫేజ్‌లోని రెండున్నర ఎకరాల పార్కు స్థలం వద్ద వాటర్ వర్క్స్ రోడ్డులో యువకులు అడ్డాగా చేసుకొని మత్తు పదార్థాలు సేవిస్తున్నట్లు కాలనీ వాసులు చెబుతున్నారు. పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు వస్తే గమనించేందుకు రోడ్డు మూల మలుపు వద్ద ప్రత్యేకంగా మనుషులను పెట్టుకుని పట్టు బడకుండా అప్పటికప్పుడు అక్కడి నుంచి జారుకునేలా చూసుకుంటున్నారు. రోడ్డు నెంబర్ 2 నుంచి బేకరీని ఆనుకొని ఉన్న రోడ్డులో పాత ఎల్ఐజీ గృహాన్ని కేవలం సిగరెట్లు తాగేందుకు మాత్రమే కొందరు వినియోగిస్తూ ఇందుకు అద్దెను కూడా చెల్లిస్తుండటం గమనార్హం. ఉత్త సిగరెట్లు మాత్రమే తాగుతున్నారా?, ఇతర మత్తు పదార్థాలు కూడా ఉన్నాయా? అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రమ్యా గ్రౌండ్ ప్రాంతంలోని ఓ మూలన ఉన్న ప్రహరీ గోడ వద్ద గంజాయి సేవించేందుకు ప్రయత్నించగా.. స్థానికులు పెద్ద ఎత్తున నిలదీయడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. తిరిగి అటువైపుగా వచ్చేందుకు కూడా సాహసించలేదు.

నిఘా పెంచాల్సిందే...

కేపీహెచ్‌బీ కాలనీ వంటి రద్దీ ప్రాంతాల్లో ఎవరు వస్తున్నారో, ఎవరు వెళ్తున్నారో గుర్తించడం చాలా కష్టతరమైన విషయం. లెక్కకు మించి వెలిసిన హాస్టల్స్‌లో రోజు వందలకొద్దీ మంది వస్తూపోతుంటారు. గతంలో హాస్టళ్లను అడ్డాగా చేసుకొని గంజాయి అమ్మకాలు సాగించడంతో పోలీసులు గట్టి నిఘా పెట్టి కట్టడి చేశారు. అయితే ఇతర రాష్ట్రాల నుంచి రైళ్లు, బస్సుల్లో తెల్లవారుజామునే గంజాయి, హాష్ ఆయిల్ వంటివి తెచ్చి ఇక్కడి నిర్మానుష్య ప్రదేశంలో తమ ముఠా సభ్యులకు విక్రయించి తిరికి రాత్రి వేళల్లో వెళ్లిపోతున్నారు. సమాచారం ఉంటే తప్ప అట్టి ముఠాలను పట్టుకోలేని పరిస్థితి నెలకొంది. ఒకవైపు స్థానిక పోలీస్, ఎస్ఓటీ, మరోవైపు ఎక్సైజ్ పోలీసులు, వారి టాస్క్‌ఫోర్స్ బృందాలు నిఘా పెట్టి దాడులు చేస్తున్నారు. ఎక్కువగా 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సున వారే ఈ దాడుల్లో పట్టుబడుతున్నట్లు ఇటీవల టాస్క్‌ఫోర్స్ అధికారి మీడియాకు వెల్లడించారు.

ఖాళీ స్థలాలపై నిఘా పెంచాలి



కేపీహెచ్‌బీ కాలనీలోని ఖాళీ స్థలాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న విషయంపై పలుమార్లు అదికారులకు ఫిర్యాదు చేశాం. ఐదవ ఫేజ్ వద్ద ఉన్న ఖాళీ స్థలానికి ప్రహరీ నిర్మించాలని కోరాం. అప్పటి వరకు పోలీసులు నిఘాను పెంచాలి. ఇప్పటికే ఇక్కడి ఖాళీ స్థలంలో ఒకసారి ఓ మహిళ మృతదేహం దొరికింది. మరోసారి రాత్రి వేళల్లో దారి దోపిడీలు జరిగాయి. రోడ్ల పక్కన గుంపులుగా చేరుతున్న యువకులు అర్ధరాత్రి వరకు తిష్టవేసి మద్యం, సిగరెట్లు, ఇతర మత్తు పదార్థా సేవిస్తున్నారు. పోలీసులు పక్కాగా నిఘా పెట్టి కట్టడి చేయాలి.

– వీవీ రావు, కేపీహెచ్‌బీ కాలనీ ఐదవ ఫేజ్ సంక్షేమ సంఘం ప్రతినిధి.

తల్లిదండ్రుల నిఘా కూడా అవసరం

పిల్లలు, యువకులు ఇంటి నుంచి బయటకు వెళ్లిన తరువాత వారు చెప్పిన చోటకే వెళ్తున్నారా?, మరేదైనా చోటికి వెళ్లి చెడు అలవాట్లకు బానిసలవుతున్నారా? అనే కోణంలో తల్లిదండ్రులు. కుటుంబ సభ్యులు దృష్టి సారించాలి. మత్తు పదార్థాల కట్టడికి ప్రభుత్వ పరంగా మెరుగైన చర్యలు తీసుకున్నప్పటికీ వాటి వినియోగానికి ఎవరూ ముందుకు రాకపోతేనే కట్టడి పూర్తి స్థాయిలో సాధ్యం అవుతుంది. ఇప్పటికే అన్ని స్థాయిల్లో నిఘాను పెంచి చర్యలు తీసుకుంటున్నాం.

– జీవన్‌కిరణ్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారి.

రేపటి నుంచి పోచమ్మ తల్లి కల్యాణ మహోత్సవం

మోతీనగర్: మూసాపేట డివిజన్ కబీర్‌నగర్‌లో పోచమ్మ తల్లి కల్యాణ మహోత్సవాన్ని శనివారం నుంచి సోమవారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. శనివారం ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, 7 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, సాయంత్రం 5 గంటలకు గంగా తెప్పకు బయలు దేరుట, ఆదివారం ఉదయం 6 గంటలకు అమ్మవారికి అలంకారం, 9 గంటలకు అమ్మవారి కల్యాణం, అన్నప్రసాద వితరణ, పట్నాలు, అగ్నిగుండాలు, సోమవారం అమ్మవారి బోనాలు, సాయంత్రం 3 గంటలకు తొట్టెల ఊరేగింపు వంటి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి, వివేకానందనగర్, చిత్తారమ్మ దేవాలయం సమీపంలోని వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ వద్ద బుధవారం రాత్రి ఓ కారు విద్యుత్ స్తంభాన్ని కారు ఢీ కొట్టింది. కారులోని ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావటంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. కారు ముందు స్పీడ్‌గా వెళ్తున్న బైక్‌ను తప్పించబోయి కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిందని స్థానికులు తెలిపారు. దీంతో విద్యుత్ స్తంభం ఒరిగిపోయింది. ఎవరికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ అధికారులు వెంటనే విద్యుత్ స్తంభానికి మరమ్మతులు చేసి విద్యుత్‌ను అందించారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీలో 15 లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఏఈ శ్రావణితో కలిసి గురువారం పరిశీలించారు. కాలనీలో కొన్ని ఇళ్ల తక్కువ ఎత్తులో ఉండటంతో రోడ్డు నిర్మిస్తే ఎత్తు పెరిగి వర్షాకాలంలో ఇబ్బంది అవుతుందని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన వరద నీరు ఇళ్లల్లోకి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకొని సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, మల్లేష్, ముజీబ్, ఫారూఖ్, ఖలీమ్, రాజుగౌడ్, శ్రీను, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎంసీహెచ్‌ఎస్ అధ్యక్షుడిగా డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్



విజయం సాధించిన సభ్యులతో అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్ తదితరులు

మోతీనగర్: మోతీనగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ నూతన పాలక కమిటీని గురువారం ఎంసీహెచ్‌ఎస్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ ఎస్.వి. ప్రసాద్, ఉపాధ్యక్షురాలిగా పి. సుధారాణి, ప్రధాన కార్యదర్శిగా బి. సీతారామయ్య, కోశాధికారిగా పీఎస్ మూర్తి, సభ్యులుగా అంజిరెడ్డి, ఆర్. శ్రీనివాసన్, వి. రుక్మిణి, కె. శ్రీనివాసరావు, కె.తులసిదాస్‌లను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి టి. విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ..దీర్ఘకాలంగా ఉన్న పలు సమస్యలను దశలవారీగా పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. సభ్యులకు తాను ఎప్పుడు అందుబాటులో ఉంటానన్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి

- ఎంపీ ఈటల రాజేందర్
- ఫతేనగర్ రైల్వే స్టేషన్‌ను పరిశీలన



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

బాలానగర్: ఫతేనగర్ రైల్వే స్టేషన్‌లోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం ఆయన ఫతేనగర్‌లోని రైల్వే స్టేషన్‌ను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలని, మూసివేసిన మార్గాలను ప్రయాణికులకు సౌకర్యంగా ఉండే విధంగా పునరుద్ధరించాలని మహిళలు కోరారు. రైల్వే స్టేషన్‌లో రెండు వైపులా రాకపోకలకు అనుగుణంగా ఎస్కులేటర్స్ ఏర్పాటు చేయాలన్నారు. వెంటనే ఈటల రాజేందర్ రైల్వే ఉన్నతాధికారుతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం ఇటీవల ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుల కంచి మహేందర్ యాదవ్, కృష్ణా గౌడ్, ఉదయ్ కుమార్, నరేష్, యాదగిరి ఎల్‌బీఎస్ నగర్ అసోసియేషన్ నాయకుడు రాములు, మూసాపేట కార్పొరేటర్ మహేందర్, రమేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఓల్డ్ బోయిన్‌పల్లి: డివిజన్ పరిధిలోని ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ అంజయ్యనగర్, జయశంకర్ కాలనీ, హరిజన బస్తీ వాసులు గురువారం ఎంపీని కలిసి సమస్యలు వివరించారు. ఆయా కాలనీల్లో తక్షణమే 12 విద్యుత్ స్తంభాలను, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రికల్ డీఈ స్వప్నతో ఎంపీ ఫోన్‌లో మాట్లాడారు. తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం విద్యుత్ పోల్స్‌ను ఏర్పాటు చేసి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఎంపీ ఈటల రాజేందర్ అధికారులకు లేఖ రాశారు. ఆ లేఖను బీజేపీ నాయకుడు ఎనుగుల తిరుపతి ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్‌కు అందజేశారు. సమస్యల పరిష్కారానికి జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శేఖర్, రమేష్, మణి, వరుణ్, కాలనీ, బస్తీవాసులు విక్రం, వెంకటేశ్వర్లు, దేవయ్య, అశోక్, మక్కాల నర్సింగ్, మస్తాన్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ రాజేందర్‌ను కలిసి సమస్యలు వివరిస్తున్న కాలనీల ప్రజలు

జేఎన్‌టీయూలో మెస్ టెండర్లు అధికారుల అనుకూల వ్యక్తులకేనా?

కేపీహెచ్‌బీకాలనీ: నిబంధలనకు విరుద్ధంగా బిక్స్ డైరెక్టర్, చీఫ్ ఇంజనీరు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు తమకు అనుకూలంగ ఉండే ఏజెన్సీలకు జేఎన్‌టీయూహెచ్‌లో మెస్ టెండర్లను కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలుస్తోంది. టెండర్ నిబంధనల్లో 2019 సంవత్సరం నుంచి తెలంగాణ ప్రభుత్వం ద్వారా పొందిన లేబర్ లైసెన్స్, ఫుడ్ లైసెన్స్ అనుమతులు ఉన్నవారికే టెండర్ మంజూరు చేయాలని నిబంధనలు ఉన్నాయి. సరైన అనుమతులు లేని ఏజెన్సీలకు కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే అర్హత గల ఏజెన్సీలకు మెస్ టెండర్లు ఇవ్వాలని, లేని పక్షంలో ఎస్‌ఎంఎస్ విధానం హాస్టల్‌లో ప్రవేశపెట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



కూకట్‌పల్లి: కార్పొరేటర్ సత్యనారాయణ కుమారుడు శివ అభిషేక్ రావు – దివ్యల వివాహం సందర్భంగా గురువారం డివిజన్ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివన్నారు. తమ ఇంట్లో శుభకార్యం సందర్భంగా పంపిణీ చేసినట్లు తెలిపారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

ఆర్టీసీ ఎండీ సజ్జనార్



బానోత్ అకిరానందన్‌ను సన్మానిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

మూసాపేట: యువత అన్ని రంగాల్లో రాణించాలని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. కూకట్‌పల్లి డిపోలో విధులు నిర్వహిస్తున్న కండక్టర్ మోహన్ కుమారుడు బానోత్ అకిరానందన్ మొరాకో దేశంలో 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో బంగారు పతకాన్ని సాధించాడు. దీంతో ఆయనను గురువారం సన్మానించారు. కార్యక్రమంలో మునిశేఖర్, వెంకన్న, శ్రీధర్, ఉషా, కూకట్‌పల్లి డిపో మేనేజర్ హరి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సేవా భారతి ట్రస్టుకు రూ.లక్ష విరాళం



చెక్కు అందజేస్తున్న విజయ్‌కుమార్

మోతీనగర్: సేవా భారతి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు చేస్తున్న సేవలు అభినందనీయమని ప్రముఖ విద్యా వ్యాపారవేత్త గాజుల విజయ్‌కుమార్ అన్నారు. వారు చేస్తున్న సేవలకు ఆకర్షితులై తనవంతు బాధ్యతగా గురువారం సేవా భారతి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి ఎస్.ఎన్. బైరెడ్డికి లక్ష రూపాయల చెక్కును విజయ్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ.. ట్రస్టులో అందరూ వయోవద్ధులు ఉన్నప్పటికీ సేవ చేయటంలో మాత్రం యువతకు ఏ మాత్రం తీసిపోరని తెలిపారు. అనంతరం సేవా భారతి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి బైరెడ్డి మట్లాడుతూ.. విద్యా, వైద్యం, ఉపాధి లక్ష్యంగా ట్రస్ట్ పనిచేస్తుందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డి. రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జైహింద్ యాత్రకు తరలిన నాయకులు



అల్లాపూర్ డివిజన్ నుంచి తరలివెళ్తున్న కార్యకర్తలు



ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో..

ఆల్విన్‌కాలనీ/మోతీనగర్: బాచుపల్లిలో జరిగే జైహింద్‌యాత్ర యాత్రకు గురువారం కాంగ్రెస్ అల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు మైనొద్దీన్, సీనియర్ నాయకులు మస్తాన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు తరలి వెళ్లారు. ఆల్విన్ కాలనీ నుంచి కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ర్యాలీకి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌ని బీజేపీ రాజకీయాలకు వాడుకుంటున్నదని విమర్శించారు. భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య కాల్పుల విరమణపై ట్రంప్ వాఖ్యలకు మౌనంగా ఉన్న మోడీ తీరును ఎండగట్టేందుకు జైహింద్ యాత్రను కాంగ్రెస్ పార్టీ చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో విఠల్ రెడ్డి, ఎన్. నరసింహయాదవ్, పల్లపు వేణు, జాకీర్ అబ్దుల్లా, రవి పాల్గొన్నారు.

వనమహోత్సవంలో 70 లక్షల మొక్కలు నాటాలి

అధికారుల సమావేశంలో అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

సాక్షి సిటీబ్యూరో: వనమహోత్సవంలో పండ్లు, ఔషధ మొక్కలను కూడా ఎక్కువగా నాటేలా చూడాలని, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీహాల్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. గ్రామీణాభివృద్ధి, అటవీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వనమహోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలం ముందుగానే మొదలైనందున ఈసారి మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా ముందుగానే అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు.

- జిల్లాలోని మున్సిపాలిటీల్లో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని, అందుకు అవసరమైన కార్యాచరణ, ప్రణాళికాబద్ధంగా వెళ్లాలని సూచించారు. జిల్లాలో 70.604 లక్షల వరకు మొక్కలను రోడ్లకు ఇరువైపుల, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ సంస్థల్లో విరివిగా నాటి లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈ మొక్కల్లో పండ్లు, ఔషధ మొక్కలతో పాటు ఈత మొక్కలను తప్పనిసరిగా 10 శాతం నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సంరక్షణ చర్యలు చేపట్టాలి..

మొక్కలను నాటడమే కాకుండా వాటికి రోజూ నీళ్ల అందించడం, ఎరువు తదితర సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మొక్కలు నాటేందుకు సరిపడా స్థలాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. మొక్కలు నాటిన స్థలాలను జియో ట్యాగింగ్ ద్వారా టీజీఎఫ్‌ఎంఐఎస్ వెబ్‌సైట్‌లో ప్రతిరోజూ నమోదు చేయాలని ఆదేశించారు. డీఆర్‌డీఓ సాంబశివరావు, జిల్లా అటవీశాఖాధికారి జానకీరాం, పర్యాటకశాఖాధికారి శ్రీధర్, ఆర్‌అండ్‌బీఈఈ శ్రీనివాస్ మూర్తి, జిల్లా ఎస్సీ సంక్షేమశాఖాధికారి వినోద్‌కుమార్, హౌసింగ్ పీడిరమణమూర్తి, హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, అటవీశాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా